క్లుప్తంగా

రాఘవుడి సన్నిధిలో శ్రీశైలం ఈవో



ఈవో లవన్న దంపతులకు ఆహ్వానం పలుకుతున్న మఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్

మంత్రాలయం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం శ్రీశైలం ఆలయ ఈవో లవన్న కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు పట్టారు. రాఘవేంద్రుల శేషవస్త్రం, అక్షింతలు అందుకున్నారు.

సీఎస్ఐ సమాధుల తోటలో బోరు ఏర్పాటు



సమాధుల తోటలో బోరు వేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పట్టణంలోని సీఎస్ఐ సమాధుల తోటలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ శనివారం రాత్రి బోరుబావి వేయించారు. దీంతో సీఎస్ఐ సంఘం క్రైసవ కుటుంబాలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాయి. సీఎస్ఐ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ ఎస్.జాన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మంచి మనస్సుతో సమాధుల తోటలో బోరుబావి వేయించడం హర్షించదగ్గ విషయమన్నారు. అంత్యక్రియల కోసం శ్మశానానికి వచ్చే ప్రజలకు మంచినీటి సమస్యను తీర్చడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ఐ టౌన్ సంఘం సెక్రటరీ జాన్ క్రిసోస్టమ్, కోశాధికారి జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మహ్మద్‌హుస్సేన్ అన్నారు. పట్టణంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మెమొంటోతో పాటు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాన్‌బాషా, నజిముద్దీన్, జిలానీ, కలాం పాల్గొన్నారు

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణ పూజలందుకుంటున్న మహానందీశ్వరుడు

మహానంది: శ్రీగంగా కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు ఆదివారం కల్యాణోత్సవ పూజలు కనుల పండువగా జరిగాయి. వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేపట్టి కల్యాణోత్సవం జరిపించారు.

సండే సందడి

మహానందిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది . సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రజకులను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: బెంగళూరులో టీడీపీ కార్యకర్తలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో రజకులను కించపరిచేలా మాట్లాడిన టీడీపీ మహిళా కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల నాయకులు రామాంజనేయులు, నాగభూషణం, 108 శ్రీను, ఆనంద్, గోకారి, రవి, ఎల్ఐసీ మధు తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చాకలి వెధవలంటూ కించపరిచేలా మాట్లాడటం సమంజసంగా లేదన్నారు. చాకలి, చాకలోడా అనే పదాలను నిషేధించటంతో పాటు ఆ పదాలతో ఎవ్వరైనా పిలిచినా, ఉచ్చరించినా నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదుచేయవచ్చునని ప్రభుత్వాలు జీవోను విడుదల చేశాయని గుర్తుచేశారు. రజకులను దుర్భాషలాడిన ఐటీ ఎంప్లాయిపై తగిన చర్యలు తీసుకొని నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వాడవాడలా వినాయక చవితి సందడి



ఆత్మకూరు పట్టణంలో విక్రయానికి ఉంచిన గణనాథులు



పూజా సామగ్రి విక్రయిస్తున్న దృశ్యం.



మహానందిలో కొలువైన గణనాథుడు

ఆత్మకూరు: పట్టణంతోపాటు అన్ని మండలాల్లో వినాయకచవితి సందడి మొదలైంది. పట్టణంలోని కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్ తదితర కూడళ్లల్లో వినాయకచవితి సందర్భంగా పూజా సామగ్రి, మామిడాకులు గరిక, ఉత్తరేణి, చెరుకుగడలు, వెలగపండ్లు, బంతిపూలతో పాటు చిన్న చిన్న గణనాథుల విగ్రహాలు వందల సంఖ్యలో అమ్మకాలు జరుగుతున్నాయి. చిన్న విగ్రహాలు రూ.200 నుంచి రూ.2000 లకు పైగా ధర పలుకగా, పెద్దపెద్ద విగ్రహాలు రూ.14వేల నుంచి 25వేలు, 55 వేల వరకు కూడా పలికాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది వ్యాపారం అధికంగా ఉండడంతో వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పట్టణంలో 40 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు ఇప్పటికే మండపాలు సిద్ధం చేశారు.



అమ్మకానికి సిద్ధంగా వివిధ రకాల పుష్పాలు



మట్టి గణపతులను విక్రయిస్తున్న దృశ్యం

మిడుతూరు: మండలకేంద్రంతోపాటు పీరుసాహెబ్ పేట, పైపాలం, నాగలూటి, కడుమూరు, మాసపేట, చెరుకుచెర్ల, రోళ్లపాడు, తలముడిపి, దేవనూరు, చౌట్కూరు తదితర గ్రామాల్లోని మండపాలల్లో గణనాథులు కొలువుదీరారు. మండపాలను మామిడి తోరణాలు, టెంకాయ మట్టలు, అరటి కొమ్మలు, విద్యుద్దీపాలతో తో ప్రత్యేకంగా అలంకరించారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

మండలంలోని అన్ని గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా అందరూ ఐకమత్యంతో కలిసి వినాయక చవితి పర్వదిన వేడుకలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. ఉత్సవం ప్రారంభమైనప్పటి నుంచి నిమజ్జన వేడుకల వరకు కమిటీ నిర్వహకులు అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలల్లో అల్లర్లకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో వినాయక మండపాల ఏర్పాటు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో వాడ వాడలా వినాయక విగ్రహాల ఏర్పాటుకు మండపాలను ఏర్పాటు చేశారు. మండపాలను రంగురంగుల విద్యుత్‌దీపాలతో తీర్చిదిద్దారు. రూ.వేల నగదును వెచ్చించి తెచ్చిన వినాయకుని ప్రతిమలను మండపాలకు చేర్చారు. వినాయకుని మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా వినాయక విగ్రహ ఏర్పాటు కమిటీలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



తాటిపాడులో ఏర్పాటు చేసిన వినాయక మండపం

మహానంది: వినాయకచవితి పర్వదినం సందర్భంగా మహానంది పుణ్యక్షేత్రంతో పాటు 13 గ్రామపంచాయతీ, మజర గ్రామంలో సందడి నెలకొంది. ఉత్సవ కమిటీల నిర్వాహకులు విగ్రహాలను గ్రామాలకు తీసుకువచ్చారు. మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణ చేసి సోమవారం విగ్రహాలను కొలువుతీరనున్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న సత్ర నిర్వాహక కమిటీ

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలోని విశ్వ బ్రాహ్మణ నిత్యాన్నదానసత్రంలో విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఆదివారం గణపతిపూజ, పుణ్యహవాచనం, ప్రాణప్రతిష్ఠ, మండపారాధన, విశ్వకర్మ పతాకావిష్కరణ, విశ్వకర్మ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. సత్రం అధ్యక్షుడు ముత్తలూరి బాలయ్య ఆచారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశ్వకర్మ జయంతిని సెలవుదినంగా ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. లోకకల్యాణార్థం సర్వజనులు ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాభివృద్ధి చెందాలని విశ్వకర్మ భగవానుడిని ప్రార్థిస్తూ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్రం ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల నరసింహాచారి, కోశాధికారి నాగభూషనాచారి, సెక్రటరీ లింగాల సాయిబాబ, ఉపాధ్యక్షులు సామంతపూడి సుబ్బారావు, గౌరవ సలహాదారు వెంకటేశ్వరరావు, సత్రం మేనేజర్ చోడాబ్రహ్మ సిద్ధార్థ, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం సత్రంలో బస చేసిన వారందరితో పాటు జయంతి ఉత్సవానికి విచ్చేసిన వారికి భోజన ప్రసాద వితరణ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్ విడుదల

మిడుతూరు: వచ్చే నెల 3 నుంచి 31వ తేదీ వరకు గ్రామ సచివాలయాల పరిధిలో (రెండు బృందాలు) టీమ్-1 ఎంపీడీఓ, టీమ్-2 తహసీల్దార్ బృందాలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి తెలిపారు. 3వ తేదీ చింతలపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, 5న దేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 7న జలకనూరులోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో, 10న చెరుకుచెర్ల గ్రామంలో రచ్చకట్ట వద్ద, 12న మాసపేట గ్రామంలో ఆర్‌సీఎం స్కూల్‌లో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 18న అలగనూరు గ్రామ సచివాలయం వద్ద, 19న చౌట్కూరు గ్రామ సచివాలయం వద్ద, 21న తిమ్మాపురం సచివాలయం వద్ద, 25న మిడుతూరు-1 విలేజ్ క్లినిక్, 26న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పీరుసాహెబ్ పేటలో, 28న నాగలూటి విలేజ్ క్లినిక్ వద్ద, 31న వీపనగండ్ల గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శానిటేషన్ పరికరాలు, డస్టుబిన్ల మంజూరు



పాఠశాలలకు మంజూరైన డస్టుబిన్లు

జూపాడుబంగ్లా: మనబడి నాడు-నేడు కింద పాఠశాలలను ఆధునీకీకరించిన ప్రభుత్వం పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకుగాను అవసరమైన శానిటేషన్ పరికరాలు, డస్టుబిన్లను మంజూరు చేసినట్లు ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 28 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం శానిటేషన్ పరికరాలు మంజూరయ్యాయన్నారు. పాఠశాలల్లోని శానిటేషన్ వర్కర్లకు 156 చేతిగ్లౌజులు, 156 మినీ బ్రషులు, 39 ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, డస్టుబిన్లు, డైపర్స్, గ్రూమ్స్ లాంగ్ హ్యాండిల్, స్ప్రే బాటిల్స్, స్టిక్ రీఫిల్స్, రీఫిల్ వైపర్, మాప్‌లు ఒక్కొక్కటి 78చొప్పున వచ్చాయన్నారు. హ్యాండిల్ బ్రషులు, జాకెట్స్ 117, టాయ్‌లెట్ బ్రషులు 156 ఇలా అన్నిరకాల శానిటేషన్ పరికరాలు పాఠశాలలకు మంజూరు చేసినట్లు వివరించారు. వీటిని ఉపయోగించుకొని పాఠశాలల్లో తరగతి గదులు శుభ్రంగా ఉంచుకోవాలని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

యాజమాన్య హక్కులు కల్పించండి



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో సమావేశమైన అఖిలపక్ష నేతలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో నివసిస్తున్న వారికి భూమిపైన యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నేతలు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డికి విన్నవించారు. ఆదివారం సాయంత్రం సున్నిపెంటలోని ఏపీజెన్‌కో అతిథిగృహంలో ఎమ్మెల్యే శిల్పాతో అఖిల పక్ష నేతలు సమావేశమై చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గృహాలపై రీసర్వే జరుపుతున్నామని, ఈ సర్వే పూర్తయిన తర్వాతే ఖాళీ స్థలాలు, ఆక్రమిత స్థలాలు, అలార్ట్‌మెంట్ స్థలాలపై సర్వే చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శిల్పా అఖిల పక్ష నేతలకు హామీ ఇచ్చారు. సున్నిపెంట గ్రామ అభివృద్ధిపై ప్రజల హక్కులపై భవిష్యత్ కార్యాచరణ కోసం అఖిలపక్ష కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా నాగిరెడ్డి, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా గుండయ్య యాదవ్, దాసరి మల్లికార్జున, జంకారా మసుబ్బారెడ్డి, వై.ఆశీర్వాదం, సభ్యులుగా అన్ని రాజకీయ పార్టీలు, కార్మికులు, కుల సంఘాలకు చెందిన వారిని ఎన్నుకున్నారు.

సాక్షిగణపతి వద్ద పార్కింగ్ ఫీజు

- ఒక్కొక్క వాహనానికి రూ.20 చొప్పున వసూలు చేస్తున్న అటవీశాఖ
- దేవస్థానానికి అక్కడ స్థలం లేకపోవడమే కారణం

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని సందర్శనీయ స్థలాల్లో ఒకటైన సాక్షిగణపతి వద్ద అటవీశాఖ వారు నూతనంగా టోల్‌గేట్ ఏర్పాటు చేసి, పార్కింగ్ ఫీజు వసూలు చేయడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలాన్ని సందర్శించి వెళ్లే ప్రతి ఒక్క భక్తులు సాక్షిగణపతికి తప్పనిసరిగా దర్శించుకుని వెళ్లాలనేది సంప్రదాయం. రూ.20 చొప్పున అటవీశాఖ అధికారులు పార్కింగ్ ఫీజు కింద అక్కడ ఆగే ప్రతి వాహనానికి ఆదివారం నుంచి వసూలు చేస్తున్నారు. దేవస్థానానికి సంబంధించిన స్థలం అక్కడ లేకపోవడం, అటవీశాఖకు సంబంధించిన స్థలం మాత్రమే ఉండడంతో దేవస్థానం అధికారులు పార్కింగ్ ఫీజుసూలు పట్ల ఏమి చేయలేని పరిస్థితి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే అధికారికంగా అటవీశాఖ వారు ఫీజ్ వసూలు చేస్తున్నారా...?, లేక స్థానిక అధికారుల ఆదేశాలతో వసూళ్లకు పాల్పడుతున్నారా..అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏదేమైనప్పటికి ఇప్పటికే శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్డులో రెండు చెక్‌పోస్టులు, శ్రీశైలం- తెలంగాణకు వెళ్లే ఘాట్‌లో రెండు చెక్‌పోస్టలలో టోల్‌గేట్ ఫీజ్ వసూలు చేస్తున్నారు. తాజాగా సాక్షిగణపతికి వద్ద పార్కింగ్ వసూలు చేయడం పట్ల అటవీశాఖపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దేవస్థానం వారు అటవీశాఖతో ఉన్నత స్థాయిలో చర్చించి భక్తుల సొమ్ముకు నష్టం వాటిళ్లకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా వాహనదారులు కోరుతున్నారు.

ఎన్ని పార్టీలు కలిసివచ్చినా ఏమి చేయలేవు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- చట్టబద్ధంగానే చంద్రబాబు అరెస్ట్
- సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలే మమ్మల్ని గెలిపిస్తాయి
- అగ్నిప్రమాద బాధితులకఒక్కొక్కరికి రూ.20వేల చొప్పన రూ.2.80లక్షల పంపిణీ



దుకాణదారులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏమి చేయలేవని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీశైలంలో ఎమ్మెల్యే శిల్పా మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు అరెస్ట్ చట్టబద్ధంగానే జరిగిందన్నారు. తప్పు చేశారు కాబట్టి చట్టం తనపని తాను చేసుకుంటూ అరెస్ట్ చేసిందని దానిలో అక్రమం ఏముంటుందని ప్రశ్నించారు. మొన్నటిదాకా లోకేష్ యువగళం పేరుతో మమ్మల్ని ఏమి పీకావు అని అన్నారని, అలాగే చంద్రబాబు కూడా నాపై 36 కేసులు ఉన్నాయి, మీ నాన్న ఏమి పీకలేదు, నీవు ఏమి పీకుతావని అన్నారని గుర్తుచేశారు. ఈ రోజు అన్ని ఆధారాలతో కేసు నమోదు చేసి చట్టపరంగా అరెస్ట్ చేశారని తెలిపారు. 36 కేసులు ఉంటే అన్నింటిపై స్టే తెచ్చుకున్నారని, ఏ రోజైనా నా కేసులపై విచారణ చేయమని చంద్రబాబు కోరలేదని ప్రశ్నించారు. వందల పార్టీలు కలిసి వచ్చిన మాకు ఎటువంటి ఇబ్బంది లేదని, 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హమీలను ప్రజలు గుర్తించారని, మాకు మేలు కలుగుతుందని ప్రజలు నమ్మి వైఎస్సార్‌సీపీకి 151 సీట్లు కట్టబెట్టారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హమీల్లో 99శాతం నెరవేర్చిన సీఎం భారతదేశంలో ఎవరైనా ఉన్నారా అంటే ఒక్క జగన్ మాత్రమేనని ఎమ్మెల్యే అన్నారు. అటువంటి ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధి చేసి చూపించిన తరువాత మాకు 175 సీట్లు వస్తాయని ధీమాగా ఉన్నామన్నారు.

సిద్ధాపురం చెరువు నుంచి సాగు నీటికి ఢోకాలేదు

ఆత్మకూరు: ఈ ఏడాది ఖరీఫ్ లో సిద్ధాపురం చెరువు కింద పంటలు సాగు చేసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం సిద్ధాపురం చెరువును ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సిద్ధాపురం, ఎస్ఎన్‌తండా, వెంకటాపురం, అమలాపురం, కృష్ణాపురం గ్రామాల రైతుల వరి పంట సాగుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని, సిద్ధాపురం చెరువు కింద రైతులు సాగు చేసిన పంటలకు ఎలాంటి ఢోకా లేదని, ఖరీఫ్ పంట చేతికి వచ్చేంత వరకు సాగు నీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివశంకర్ నాయక్, సుధాకర్,ఇతర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాంబా వాణిజ్య సముదాయంలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన దుకాణదారులను అన్ని విధాల ఆదుకుంటామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం శ్రీశైలంలో లలితాంబా వాణిజ్య సముదాయంలో దుకాణాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అగ్నిప్రమాదంలో నష్టపోయిన 14 మంది దుకాణదారులకు ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున మొత్తం రూ.2.80లక్షలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ ఆగస్టు 30 అర్ధరాత్రి లలితాంబా వాణిజ్య సముదాయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం దురదృష్టకరమైన ఘటన అని అన్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే సంఘటాస్థలానికి చేరుకుని బాధితులకు భరోసా కల్పించడం జరిగిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం అందజేశానన్నారు. దుకాణదారుల సమస్యలపై దేవదాయశాఖ మంత్రి, దేవదాయశాఖ ఉన్నతాధికారులతో కూడా మాట్లాడడం జరిగిందన్నారు. వారికి న్యాయం చేకూర్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. అలాగే మంగళవారం శ్రీశైలం రానున్న దేవదాయశాఖ మంత్రితో మాట్లాడుతానని, వారిని అన్ని విధాల ఆదుకునేందుకు అవసరమైతే రాష్ట్ర సీఎంతో కూడా చర్చిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, మండల ఇన్‌చార్జ్ భరత్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, నాయకులు కృష్ణమోహన్ రెడ్డి, ఏడుకొండలు, అనిల్‌రెడ్డి, విష్ణు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై వేధింపులు తగవు

నందికొట్కూరు: ఆటో కార్మికులపై పోలీసులు వేధింపులకు పాల్పడడం తగదని సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, పక్కీర్ సాహెబ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆటో కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులపై ఓవరు లోడు పేరుతో వేధింపులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి నెల ఆటో కార్మికులకు ఏదో ఒక సాకూ చూపుతూ వేల రూపాయలు జరిమానా విధించడం దారుణమన్నారు. సమావేశంలో ఆటో కార్మికుల యూనియన్ నాయకులు పీరయ్య, వెంకటరెడ్డి, జమాల్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో కాలుష్య నివారణ

నందికొట్కూరు: మట్టి వినాయక విగ్రహాల వలన వాతావరణ కాలుష్యం నివారించవచ్చుని దాతలు బైసాని సురేష్‌గుప్తా తెలిపారు. ఆదివారం పట్టణంలోని దాతలు 1500 మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాల వలన కలిగే లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మట్టితోనే తయారు చేసిన విగ్రహాలను భక్తులు ప్రతిష్ఠించుకొని పూజించాలని సూచించారు. భక్తులకు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేసే భాగ్యం రావడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బజాజ్ షోరూం నిర్వహకులు రంగస్వామి, ఆర్‌డీ ప్రసాద్, రఘు, అల్వాల శేషు, తదితరులు పాల్గొన్నారు.

80శాతం రాయితీపై విత్తనాలు మంజూరు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ 2023 ఆకస్మికత విత్తన పథకం కింద నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, మిడుతూరు, పగిడ్యాల, పాములపాడు మండలాలకు 80 శాతం రాయితీపై విత్తనాలు మంజూరైనట్లు ఏడీఏ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హైటెక్ రకం జొన్న విత్తనాలు, పీయూ 31రకం మినుము, ఎల్ఆర్‌జీ 52 రకం కందులు, పీవీటీహైబ్రీడ్ రకం మొక్కజొన్న విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ విత్తనాలను ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి దెబ్బతిన రైతులు, పొలాలను బీడుగా ఉంచుకున్న రైతులకు 80శాతం రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులకు రెండు హెక్టార్లకు సరిపడా విత్తనాలను పంట ధ్రువీకరణ పత్రాలు తీసుకొని అందజేయాల్సి ఉంటుందన్నారు. విత్తనాలను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా డీక్రిషి యాప్‌లో నమోదు చేసుకొని పొందవచ్చన్నారు.

మండలాల వారీగా..

జూపాడుబంగ్లా మండలానికి జొన్నలు 10 క్వింటాళ్లు, మినుములు 19 క్వింటాళ్లు, కందులు 5 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. నందికొట్కూరు మండలానికి జొన్నలు-10, మినుములు-5, మొక్కజొన్నలు-10క్వింటాళ్ల చొప్పున మంజూరైనట్లు తెలిపారు. మిడుతూరు మండలానికి 15 క్వింటాళ్ల జొన్నలు, 5 క్వింటాళ్ల మినుములు, 10 క్వింటాళ్ల మొక్కజొన్నలు వచ్చాయన్నారు. పగిడ్యాల మండలానికి జొన్నలు, మినుములు 10 క్వింటాళ్ల చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. పాములపాడు మండలానికి జొన్నలు, మినుములు 10క్వింటాళ్లు, కందులు 50క్వింటాళ్లు, మొక్కజొన్నలు 35క్వింటాళ్ల చొప్పున కేటాయించారని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని రబీపంటలను సాగుచేసుకోవాలని సూచించారు.

ప్రధాని జన్మదినం సందర్భంగా పూజలు



కొబ్బరికాయలు సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

నందికొట్కూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండెపోగు చిన్న సుంకన్న, పట్టణ అధ్యక్షుడు గూడూరు రవికుమార్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నరేంద్రమోదీకి భగవంతుడు ఆయుఆరోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, శివ, శివారెడ్డి, కిరణ్‌కుమార్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లకు ప్రధాన వీధుల్లోని గంగాధర మండపం వద్ద కొబ్బరికాయలు సమర్పించారు. దీనికి ముందుగా స్వామిఅమ్మవార్లకు ప్రధాని పేరుపై ఆయన గోత్ర నామాలతో పూజలు జరిపించినట్లు నంద్యాల సేవా పక్షోత్సవాల కన్వీనర్ అరవింద్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు దరివేముల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.